సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 15 | జూలై | 2025



కమీషన్ల కక్కుర్తి
అన్నదాతల నుంచి అధిక కమీషన్ వసూలు చేసిన అడ్తిదారులు, మార్కెట్ అధికారులకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. - 8లో ▸



కూరగాయల సాగుకు ప్రోత్సాహం
కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాయితీ సదుపాయం కల్పించింది. - 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం $33^0/27^0$
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణస్థితిలో ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భద్రకాళీ మాడవీధుల పనుల్లో వేగం పెంచండి



నయీంనగర్: భద్రకాళి మాడవీధుల నిర్మాణ పనుల్లో వేగం పెంచి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని 'కుడా' వీసీ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం భద్రకాళి ఆలయ మాడవీధుల పనులు, చెరువులో ఏర్పాటు చేస్తున్న ఐలాండ్ పనుల పురోగతిని కమిషనర్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఇన్నర్ రింగ్ రోడ్ ఏర్పాటు చేస్తున్న ప్రాంతాలను సందర్శించి మిగిలిన భూసేకరణను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో 'కుడా' పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు, భద్రకాళి పూజారి శేషయ్య, ఈఓ శేషు భారతి తదితరులు ఉన్నారు.

ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ ప్రాధాన్యం



హన్మకొండ: ప్రమాదాలు జరగకుండా ఆర్టీసీ డ్రైవర్లు సురక్షిత డ్రైవింగ్ చేయాలని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను సూచించారు. సోమవారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజియన్ కార్యాలయంలో డ్రైవర్లకు శిక్షణ ఇచ్చారు. ఆర్ఎం డి.విజయభాను మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రతకు ఆర్టీసీ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రమాదాలు లేని వరంగల్ రీజియన్‌గా తీర్చిదిద్దేందుకు ఆర్టీసీ, అద్దె బస్సు, జేబీఎం బస్ డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మద్యం ముట్టుకోవద్దని, సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు కృషి చేయాలని కోరారు.

ప్రొఫెసర్ శ్రీలతకు అవార్డు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ సీజే శ్రీలతకు ఉమెన్ లీడర్ ఇన్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ అవార్డు లభించింది. శ్రీలతకు బెంగళూరు కేంద్రంగా ఉన్న ప్రముఖ సంస్థ ది అకడమిక్ ఇన్‌సైట్స్ నుంచి అవార్డుకు ఎంపికయ్యారు. ఈ పురస్కారం మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ఉన్నత విద్యారంగంలో విశేష సేవలందిస్తున్న మహిళలకు అందజేస్తారు. అవార్డుపై సోమవారం యూనివర్సిటీలో శ్రీలత మాట్లాడుతూ.. ఇది మహిళా నాయకత్వానికి గుర్తింపు అని పేర్కొన్నారు. ఈసందర్భంగా శ్రీలతను కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం అభినందించారు.

క్రికెట్ సంఘం బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు

వరంగల్ స్పోర్ట్స్: హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుతో పాటు వరంగల్ క్రికెట్ సంఘం కార్యదర్శి శ్రీనివాస్‌పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ.. సోమవారం 'ది తెలంగాణ క్రికెట్ సంఘం' వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, టి.జయపాల్ వరంగల్ సీపీ ఆఫీస్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. 20 ఏళ్లుగా బీసీసీఐ, హెచ్‌సీఏ, క్లబ్ సభ్యుల ద్వారా వరంగల్ జిల్లా సెక్రటరీగా శ్రీనివాస్ బాధ్యతలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జిల్లా క్రికెట్ అభివృద్ధికి రావాల్సిన నిధులను తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం వినియోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాంతీయ క్రీడాకారుల ప్రతిభను నిర్లక్ష్యం చేసి, క్రికెట్ పాలనను స్వార్థపూరితంగా మలుపుతిప్పారన్నారు. అవినీతికి పాల్పడ్డవారిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు.

నేటి నుంచి టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు


హన్మకొండ కల్చరల్: నేటి నుంచి 19వ తేదీ వరకు టీటీడీ, డీపీపీ(ధర్మ ప్రచార పరిషత్) ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు రామిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. సోమవారం హనుమకొండ భవానీనగర్‌లోని భవానీమాత దేవాలయంలో కార్యక్రమాల బ్యానర్‌ను ఆవిష్కరించారు. రామిరెడ్డి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. శ్రీభవానీమాత దేవాలయంలో నేటి(మంగళవారం) నుంచి 17వ తేదీ వరకు విజయవాడకు చెందిన మండలిక శ్రీకృష్ణకుమార్ శ్రీవెంకటాచల మహత్యంపై ధార్మిక ప్రవచనాలు, 18న కుంకుమ పూజ, 19న టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులచే అన్నమాచార్య సంకీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

- నగరంలో ఓ వైద్యురాలి అనుమానాస్పద మృతి
- మరో ఘటనలో వ్యక్తి, విద్యార్థిని బలవన్మరణం
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో కలకలం రేపిన ఘటనలు
- దోషులను శిక్షించాలని బాధిత కుటుంబికుల డిమాండ్

వివాహేతర సంబంధం! విషాదాంతం..

పచ్చని కాపురాల్లో చిచ్చు పెట్టిన పర స్త్రీ, పురుష వ్యామోహం

పచ్చని కాపురాల్లో వివాహేతర సంబంధాలు చిచ్చుపెడుతున్నాయి. పర స్త్రీ, పురుష వ్యామోహంలో పడిన ఆలుమగలు పెళ్లి అనే పవిత్ర బంధానికి విలువ లేకుండా చేస్తున్నారు. జీవితాంతం కలిసి ఉండాల్సిన దంపతులు అర్ధంతరంగా విడిపోతున్నారు. మరికొందరు నిండు జీవితాన్ని ఫణంగా పెట్టి లోకం విడిచివెళ్తున్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సోమవారం జరిగిన రెండు ఘటనలు పెళ్లి అనే బంధానికి విలువ లేకుండా చేశాయి. ఓ డాక్టర్.. రీల్స్ చేసే యువతితో ప్రేమాయణం సాగించగా, తట్టుకోలేక వైద్యురాలైన భార్య తనువు చాలించింది. ఓ లారీడ్రైవర్.. 22 ఏళ్ల కాలేజీ యువతితో ప్రేమలో పడి ఇద్దరం కలిసి ఉండలేమనుకుని పురుగుల మందు తాగారు. చికిత్స పొందుతూ చనిపోయారు.





ఎంజీఎం మార్చురీ వద్ద ప్రత్యూష తల్లితో మాట్లాడుతున్న పోలీసులు





డాక్టర్ ప్రత్యూష (ఫైల్) డాక్టర్ సృజన్

హసన్‌పర్తి: ఓ డాక్టర్ కుటుంబంలో రీల్స్ గర్ల్ పెట్టిన చిచ్చు ఒకరి ప్రాణం తీసింది. 'బుట్టబొమ్మ' ఐడీతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్ వేదికగా రీల్స్ చేసే ఆ యువతి పట్ల డాక్టర్ ఆకర్షితుడయ్యాడు. చివరికి ఇరువురు పెళ్లి చేసుకునేదాకా వెళ్లారు. దీంతో ఆ డాక్టర్ కుటుంబంలో గొడవలు ప్రారంభమయ్యాయి. చివరికి డాక్టర్ భార్య, డెంటల్ వైద్యురాలు అనుమానాస్పద మృతి స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త తరపున వారు చెబుతుండగా, తన కూతురుని హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తల్లి పద్మావతి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటన వరంగల్ నగరంలోని వైద్యవర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

అత్తామామలకు చెప్పినప్పటికీ..

డాక్టర్ సృజన్, రీల్స్ గర్ల్ మధ్య సంబంధంపై ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. ఈక్రమంలో డాక్టర్ సృజన్ తన భార్య ప్రత్యూషను శారీరక, మానసిక వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. ఈ విషయాన్ని ప్రత్యూష తన అత్తామామలు పుణ్యవతి–మధుసూదన్‌కు చెప్పింది. అయినప్పటికీ వారినుంచి ఎలాంటి స్పందన రాలేదు. చివరికి వారి బంధం పెళ్లిదాకా వచ్చింది. ఇంట్లో గొడవలు సాగుతూనే వచ్చాయి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ప్రత్యూష నగరంలోని ఎస్ఎస్ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తల్లి పద్మావతికి సృజన్ ఫోన్ చేశారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వివరించారు. వెంటనే పద్మావతి ఆస్పత్రికి వచ్చి చూడగా.. విగత జీవిగా కనిపించింది. కాగా, డాక్టర్ సృజన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

'రీల్స్ గర్ల్' మోజులో గుండెవైద్య నిపుణుడు

- భార్యకు శారీరక, మానసిక వేధింపులు..
- దంత వైద్యురాలి మృతిపై కుటుంబ సభ్యుల అనుమానాలు
- పోలీసుల అదుపులో డాక్టర్.. విచారణ
- నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్

రీల్స్ గర్ల్ ఎంట్రీ ఇలా..



డాక్టర్ సృజన్ నగరంలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో కార్డియాలజీ వైద్యుడు. ఆస్పత్రి ప్రారంభ సమయంలో యూట్యూబర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అయిన ఓ యువతి ప్రమోషన్ వర్క్ కోసం అక్కడికి వచ్చింది. అక్కడున్న వైద్యులతో ముఖాముఖి నిర్వహించింది. ఆ సమయంలో ఆ యువతి పట్ల డాక్టర్ సృజన్ ఆకర్షితుడయ్యాడు. ఈసందర్భంగా ఇరువురు పరిచయం పెంచుకున్నారు. ఆమె వివిధ భంగిమల్లో చేసే రీల్స్ చూసి మరింత దగ్గరయ్యాడు. ఆ యువతి తన రీల్స్‌లో తాను గుండె ఆపరేషన్‌ను లైవ్‌గా చూసినట్లు పోస్టులు కూడా పెట్టింది. అంటే సృజన్ ఆమెను ఆపరేషన్ థియేటర్‌లోకి కూడా తీసుకెళ్లినట్లు స్పష్టమవుతోంది. సృజన్ కారును కూడా పూర్తిగా ఆమె వాడేదని సమాచారం. ఇటీవల ప్రత్యూష రెండో కాన్పు సమయంలో తల్లిగారింటికి వెళ్లినప్పుడు ఆ యువతి విల్లాకు వచ్చిందని, అంతగా వారి ప్రేమబంధం బలపడిందని స్థానికులు చెబుతున్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి : ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్

ఎంజీఎం : డాక్టర్ ప్రత్యూష మృతదేహానికి సోమవారం ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈసందర్భంగా బంధువులతోపాటు పలువురు ఉద్యోగ సంఘాల నేతలు పెద్దఎత్తున మార్చురీకి తరలివచ్చారు. ప్రత్యూష కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీఎన్జీఓస్ ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ.. ఓ యూట్యూబర్, రీల్స్ చేసే యువతి మాయలో పడి యువ వైద్యురాలు ప్రత్యూష మృతికి కారణమైన డాక్టర్ సృజన్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, మార్చురీ వద్ద పోలీసులు మృతురాలి తల్లి పద్మావతితో మాట్లాడి వివరాలు సేకరించారు.

అతడికి 42.. ఆమెకు 22

- అతడికి వివాహమైంది. ఆమె విద్యార్థిని
- కలిసుండలేమని ఇరువురు ఆత్మహత్య

పర్వతగిరి: అతడికి పెళ్లయ్యింది.. ఇద్దరు పిల్లలు. యువతి డిగ్రీ చదువుతుంది. ఇద్దరి మధ్య వివాహేతర సంబంధం.. చివరికి వారి ప్రాణమే తీసింది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా ఏనుమాముల ఇందిరా కాలనీ ఫేజ్–2కు చెందిన వేల్పుగొండ స్వామి(42).. ఎలిశాల గాయత్రి (22) పక్కపక్కనే ఉంటారు. కుమారస్వామికి భార్య, ఇద్దరు పిల్లలు. ఒకరు తొమ్మిది, మరొకరు ఏడో తరగతి చదువుతున్నారు. లారీడ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి పక్కనే ఉంటున్న గాయత్రి నగరంలోని ఓ కాలేజీలో డిగ్రీ చదువుతుంది. వీరిద్దరికి మూడేళ్లక్రితం ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి వివాహేతర సంబంధానికి దారి తీసింది. స్వామికి.. గాయత్రిని వదిలేసి భార్యా, పిల్లలతో ఉండాలనే ఆలోచన వచ్చింది. విషయం గాయత్రికి తెలపగా, అందుకు అంగీకరించలేదు. 'నువ్వు నాతోనే ఉండాలి.. మనమిద్దరం వివాహం చేసుకుందాం' అని తెలిపింది. ఈ విషయంలో స్వామి తన భార్యను ఒప్పించాలని ప్రయత్నించినప్పటికీ ఆత్మహత్య చేసుకుంటానని ఆమె బెదిరించింది. దీంతో స్వామి ఏం చేయలేక భార్యను చికిత్స కోసం ఈనెల 2న ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడే వదిలేసి మళ్లీ వస్తానని వెళ్లాడు. రెండు రోజులైనా ఇంటికి రాకపోవడంతో 4న మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో స్వామిపై మిస్సింగ్ కేసు నమోదైంది. గాయత్రి ఈనెల 2నుంచి కనిపించడం లేదని ఆమె తండ్రి కుమారస్వామి 3న ఏనుమాముల పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు పెట్టాడు. వీరిద్దరు 2న ఇంట్లో నుంచి పారిపోయారు. తిరిగి ఇంటికెళ్తే ఇబ్బందవుతుందని, కలిసి చనిపోదామని నిర్ణయించుకుని ఆదివారం ఉదయం పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ గ్రామానికి చేరుకుని గడ్డిమందు తాగారు. గమనించిన స్థానికుడు పవన్‌కళ్యాణ్ ఫోన్ ద్వారా వారి బంధువులకు సమాచారం అందించి ఇద్దరిని 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందారు. మృతుడి అన్న యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పర్వతగిరి ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

అర్జీలు త్వరగా పరిష్కరించాలి





ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహశబరీష్, సత్యశారద

హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలు త్వరగా పరిష్కరించాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్జీల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని, సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ 23, ఆర్డీఓ హనుమకొండ 20, ఆర్డీఓ పరకాల 11, పీడీ హౌసింగ్ 18తో పాటు వివిధ శాఖలకు చెందిన మొత్తం 206 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వై.వి గణేశ్, డీఆర్డీఓ పీడీ మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, కె.నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి: వరంగల్ కలెక్టర్ సత్యశారద

న్యూశాయంపేట: ప్రజావాణికి వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి, ఆర్డీఓలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, హౌసింగ్ పీడీ గణపతి ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 150 దరఖాస్తులు రాగా.. ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించినవి 58 ఉన్నాయి. పీడీ హౌసింగ్ 25, జీడబ్ల్యూఎంసీ 13 దరఖాస్తులు రాగా వివిధ శాఖలకు సంబంధించి 54 దరఖాస్తులు స్వీకరించామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అధికారులు అనురాధ, నీరజ, పుష్పలత, విశ్వప్రసాద్, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.

గ్రీవెన్స్ తీరు మారాల్సిందే..
- రసీదు కోసం గంటల తరబడి వేచి ఉండడమేంటి?
- నేను సంతకం పెట్టాక మీకోసం వారు ఎదురు చూడడం ఎందుకు?
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ - 8లో ▸

అనధికారిక నల్లాలను గుర్తించండి

- 11 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: నగరంలోని అనధికారిక నల్లాలను గుర్తించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. ఈనెల 12వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన నల్లా.. కలెక్షన్లు' కథనానికి కమిషనర్ స్పందించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాధికారులతో సమావేశమయ్యారు. నగరవ్యాప్తంగా సుమారు 70 వేల నల్లా కనెక్షన్లు (అనధికారికంగా, ఒక ఇంటికి ఒకటికి మించి, ఇంటి నంబర్లు లేకున్నా కనెక్షన్, అపార్టుమెంట్‌లోని ప్లాట్లకు) ఉన్నట్లు పన్ను జనరేట్ అవుతోందని తెలిపారు. రెసిడెన్షియల్ నల్లా తీసుకుని కమర్షియల్‌గా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానంగా 4 కేటగిరీలుగా నల్లాలను గుర్తించేందుకు 11 బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. ఒక్కో ఏరియా పరిధిలో సుమారు 3 వేల గృహాలను క్షేత్ర స్థాయిలో సమగ్ర సర్వే చేయాల్సిందేనని ఆదేశించారు. సమాచారం నమోదుచేయాలని ఇందుకు సంబంధించిన ప్రొఫార్మా తయారు చేయాలని ఐటీ మేనేజర్‌ను కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎస్ఈ మహేందర్, పన్నుల అధికారి రామకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, ఈఈ మాధవీలత పాల్గొన్నారు.

9 జోన్లు, 13 సబ్ జోన్లుగా యూజీడీ

వరంగల్ నగరవ్యాప్తంగా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్ (యూజీడీ)ని 9 జోన్లుగా, 13 సబ్ జోన్లుగా, 23 ఎస్టీపీలు, 7 సీవరేజ్ పంపింగ్ స్టేషన్ల నెట్‌వర్క్‌పై క్షేత్రస్థాయిలో సాధ్యాసాధ్యాలపై ఇంజనీర్లు అధ్యయనం చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం హనుమకొండలోని 'కుడా' కార్యాలయంలో యూజీడీ డీపీఆర్‌పై పవర్ పాయింట్ ప్రజేంటేషన్ అనంతరం ఆమె సమీక్షించారు. డిజైన్ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉందన్నారు. అనంతరం ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించిన సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు పాల్గొన్నారు.

చేస్తాం.. చూస్తాం!

- సమస్యలు పరిష్కరించకుండా అధికారుల అలసత్వం
- పరిష్కారం చూపాలని అర్జీదారుల మొర
- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌కు 119 ఫిర్యాదులు
- దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు చేస్తాం.. చూస్తాం అంటున్నారే తప్ప పరిష్కరించడం లేదని గ్రేటర్ వరంగల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఎదుట అర్జీదారులు గోడు వెళ్లబోసుకున్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో కమిషనర్ ఫిర్యాదులు స్వీకరించారు. ఆక్రమణలు, అతిక్రమణలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఏమాత్రం చొరవ చూపడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఖాళీ స్థలాల్లో ముళ్ల చెట్లు, మురుగు కూపాలు, దోమలతో అనారోగ్యాల బారిన పడుతున్నామని ఫిర్యాదులు అందజేశారు. నల్లానీళ్లు తదితర సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజాఫిర్యాదులపై ఏ మాత్రం నిర్లక్ష్యం వహించకూడదని, పలుమార్లు హెచ్చరించినా కొంత మంది సిబ్బంది పట్టించుకోవడం లేదని, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిష్కారం కాని, పూర్తి చేసిన పనులపై వారంతపు నివేదికలు అందజేయాలని సూచించారు. గ్రీవెన్స్‌కు మొత్తం 119 ఫిర్యాదులు రాగా.. అందులో టౌన్ ప్లానింగ్‌కు అత్యధికంగా 62 ఫిర్యాదులు వచ్చాయి. ఇంజనీరింగ్ సెక్షన్‌కు 29, హెల్త్, శానిటేషన్‌కు 12, పన్నుల విభాగానికి 14, తాగునీటి సరఫరాకు 1, ఉద్యానవన విభాగానికి 1 ఫిర్యాదులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ జోనా, ఇన్‌చార్జ్ ఎస్ఈ మహీధర్, సీఎంహెచ్ఓ రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, వెటర్నరీ వైద్యుడు డా.గోపాల్‌రావు, పన్నుల అధికారి రామకృష్ణ, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ రాజేశ్, హెచ్ఓలు రమేశ్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- హనుమకొండ కృష్ణా కాలనీలో ఖాళీ స్థలాల్లో ముళ్లకంపలు, మురికి కూపాలున్నాయని, దోమలు వృద్ధి చెంది అనారోగ్యంబారిన పడుతున్నామని, ఫాగింగ్ చేయాలని కాలనీవాసులు కోరారు.
- దేశాయిపేట 13వ డివిజన్‌లో విశ్వశ్రీ రెసిడెన్సీలో అక్రమ నిర్మాణాలు చేపట్టారని, సీలింగ్ స్థలమని విచారణ చేపట్టాలని బీఎస్పీ నాయకులు వినతి పత్రం అందజేశారు.
- 14వ డివిజన్ మణికంఠ కాలనీలో సీసీ రోడ్డు అసంపూర్తిగా వేసి, వదిలేశారని పూర్తి చేయాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు.
- 11వ డివిజన్ రంగంపేటలో 15–2–323 కల్వర్టు లేక ఇబ్బందులు పడుతున్నామని, నిర్మించాలని స్థానికులు విన్నవించారు.
- 35వ డివిజన్ పుప్పాలగుట్ట లక్ష్మీగణపతి కాలనీలో రెండేళ్ల కిందట సీసీ రోడ్డు కోసం రూ.60 లక్షల నిధులు మంజూరు చేసి, పనులు చేపట్టడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- ఏనుమాముల 15వ డివిజన్ ఆక్వా వాటర్ ప్లాంట్ వద్ద వరద, మురుగునీరు స్తంభించిపోతోందని, చర్యలు తీసుకోవాలని స్థానికులు వినతి అందజేశారు.
- 13వ డివిజన్ దేశాయిపేటలో 12 ఫీట్ల రోడ్డు ఆక్రమణకు గురైందని చర్యలు చేపట్టాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.
- 53వ డివిజన్ లష్కర్ సింగారంలోని 9 ఫీట్ల రోడ్డు ఆక్రమణకు గురైందని చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.
- హనుమకొండ గుడిబండల్ బావి వద్ద మూడు నెలల కిందట కంకర పోసి, రోడ్డు నిర్మించడం లేదని, రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- 59వ డివిజన్ ఎక్సైజ్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ వసంత వినతి పత్రాన్ని సమర్పించారు.
- హనుమకొండ రెడ్డిపురంలో ఓ వ్యక్తి ఇళ్ల నడుమ పందులను పెంచుతూ, వదిలేస్తున్నారని అక్కడి నుంచి తరలించాలని స్థానికులు కోరారు.
- 36వ డివిజన్ జయశంకర్, చంద్రవదన కాలనీలో దోమలతో జ్వరాల బారిన పడుతున్నామని, గ్యాంగ్ వర్క్స్, ఫాగింగ్ చేపట్టాలని కాలనీవాసులు విన్నవించారు.
- చింతగట్టు గోశాల వెనుక భాగంలో రోడ్డుపై నిర్మాణాలు చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.
- హనుమకొండ శ్రీనగర్ కాలనీలో మూడేళ్లుగా తమకు నల్లా నీళ్లు రావడం లేదని, ఏఈకి ఫిర్యాదు చేసిన ఫలితం లేదని మణెమ్మ ఫిర్యాదు చేశారు.
- భద్రకాళి స్మార్ట్‌సిటీ రోడ్డులో డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు వినతి పత్రాన్ని సమర్పించారు.
- హనుమకొండ 6వ డివిజన్‌లోని ఇంటి నంబరు 5–2–17 నుంచి 10/2/1 వరకు విద్యుత్ స్తంభాలు, సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు కోరారు.
- హనుమకొండ స్నేహనగర్‌లో 60 ఫీట్ల రోడ్డును ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించారని, తొలగించాలని అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు.
- హంటర్ రోడ్డు రుషినగర్‌లోని వేదవతి నిలయం వద్ద సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని వేల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.
- హనుమకొండ గుడిబండల్ ఇంటి నంబర్ 3–7–134/2 నుంచి 139/ 2 వరకు సీసీ రద్దు లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేశారు.

బాధ్యత మరిచి మాట్లాడుతున్న భట్టి

- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి
- ఉపముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హన్మకొండ: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోశ్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు బన్న ప్రభాకర్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా.. హనుమకొండలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో భట్టి విక్రమార్క దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా కొలను సంతోశ్‌రెడ్డి, బన్న ప్రభాకర్ మాట్లాడుతూ.. ఉపముఖ్యమంత్రి వెంటనే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, ఎస్టీ మోర్చా నాయకుడు నానునాయక్, నాయకులు శ్రీనివాస్, శివకుమార్, వెంకటేశ్, బొచ్చు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

వరంగల్ డీఎంహెచ్ఓ సాంబశివరావు

ఖిలా వరంగల్ : శస్త్ర చికిత్సలు చేయకుండా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు వైద్యాధికారులకు సూచించారు. నగరంలోని రంగశాయిపేట పీహెచ్‌సీని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పనితీరును పర్యవేక్షించారు. అనంతరం సాంబశివరావు మాట్లాడుతూ వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య, పీహెచ్‌సీ వైద్యాధికారి రమ్య, సీసీ నాగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమష్టి కృషితోనే స్నాతకోత్సవం విజయవంతం



కేయూ క్యాంపస్: అన్ని కమిటీల సమష్టి కృషితోనే కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవం విజయవంతమైందని కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం కేయూ సెనేట్‌హాల్‌లో వివిధ కమిటీలు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల, ఎన్‌సీసీ కేడెట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వవిద్యాలయం ఇమేజ్ పెంపుదలకు కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో యూనివర్సిటీలో బోధన, బోధనేతర ఉద్యోగులకు ముఖ గుర్తింపు హాజరును ప్రవేశపెట్టబోతున్నామన్నారు. యూజీలో కూడా ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రవేశపెట్టబోతున్నామన్నారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ వరంగల్ యూ ట్యూబ్ చానల్‌ను రిజిస్ట్రార్ వి. రామచంద్రంతో కలిసి ప్రారంభించారు. పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్, ఎన్‌సీసీ కమాండెంట్ కల్నల్ సింథిల్ ఎస్. రమాదురై, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, డీన్లు, విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అలరించిన ఓరుగల్లు కళాకారుల ప్రదర్శన



హన్మకొండ కల్చరల్ : రెండు రోజులుగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన శ్రీ తనికెళ్ల భరణి రంగస్థల స్వర్ణోత్సవాల్లో భాగంగా తనికెళ్ల భరణి రచనలో వరంగల్‌కు చెందిన ఓరుగల్లు శారదానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన 'చల్‌చల్ గుర్రం' హాస్యనాటిక అలరించింది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో తనికెళ్ల భరణి.. నాటిక నిర్మాత, నటుడు జీఎస్ శర్మను సన్మానించి మెమోంటో అందజేశారు. నాటిక దర్శకుడిగా సోల్జర్ షఫీ, నటీనటులుగా మహమ్మద్, కోడం సురేందర్, కుసుమ సుధాకర్, గుడివా లహరి నటించారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్‌ఎం విభాగాధిపతిగా శ్రీనివాసులు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హెచ్‌ఆర్‌ఎం విభాగాధిపతిగా ఆవిభాగం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం సాయంత్రం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆవిభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ పెద్దమళ్ల శ్రీనివాస్‌రావు కొద్దిరోజుల క్రితం రాజీనామా చేశారు. ప్రస్తుతం రెగ్యులర్ ప్రొఫెసర్లు ఎవరూ లేకపోవడంతో శ్రీనివాసులును నియమించారు. నేడు(మంగళవారం) ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఆయన ఆవిభాగానికి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, విశ్వవిద్యాలయం మహాత్మాజ్యోతిరావు పూలే సెల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం.. శ్రీనివాసులకు నియామక ఉత్తర్వులు అందజేశారు.

కమీషన్ల కక్కుర్తి..

అన్నదాతల నుంచి అదనపు వసూళ్లు

- ఏడుగురు మార్కెట్ అధికారులు, సిబ్బందికి చార్జీ మెమోలు
- ఏడుగురు అడ్తిదారులకు నోటీసులు





వరంగల్ చౌరస్తా : అన్నదాతలకు ఆరుగాలం కష్టపడి పనిచేయడమే తెలుసు. ఏ పంటకు ఎంత ధర పలుకుతుందో ఏ మాత్రం తెలియదు. ఖరీదుదారు మాట, అడ్తిదారు(కమీషన్ ఏజెంట్లు) సముదాయింపే వాళ్లకు భరోసా. అయితే నమ్ముకున్న వారే అన్నదాతలను అందినకాడికి కమీషన్ల పేరిట దండుకున్నారు. దీనిపై ఫిర్యాదు చేస్తే మార్కెట్ అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోకుండా నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరించారు. చివరకు కడుపు మండిన రైతులు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో దోపిడీ వ్యవహారం వెలుగు చూసింది. ఈ ఘటనపై ఎట్టకేలకు సోమవారం చర్యలకు ఉపక్రమించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

4శాతం కమీషన్ కట్..

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 2022–23 సంవత్సరంలో 10 మంది రైతులు తమ పంటలను తరలించారు. సరుకులు అమ్మించేందుకు గాను అడ్తిదారులను ఆశ్రయించారు. అడ్తిదారులు వ్యవసాయ ఉత్పత్తులను అమ్మించినందుకుగాను రూ.100కు రూ.2 చొప్పున కమీషన్ తీసుకోవాలి. కానీ ఏడుగురు అడ్తిదారులు రూ.2కు బదులు అదనంగా మరో 2 శాతం అంటే 4శాతం కమీషన్ కట్ చేసుకుని రైతులకు సొమ్ము చెల్లించారు. దీంతో ఆందోళన వ్యక్తం చేసిన రైతులు మార్కెట్ అధికారులకు 14 తక్‌పట్టీ ఆధారాలతో సహా రాతపూర్వకంగా ఫిర్యాదుల చేశారు. కానీ మార్కెట్ అధికారులు, సిబ్బంది ఎవరీ నుంచి స్పందన కనిపించలేదు. దీనిపై విసిగివేసారిన రైతులు ఆయా గ్రామాల్లోని కార్యదర్శులు, ప్రజాప్రతినిధుల సహకారంతో రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు వివరాలతో ఫిర్యాదులు చేశారు. ఎట్టకేలకే రెండేళ్ల తర్వాత ఆ శాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు.

నోటీసులు, చార్జ్ మెమోలు జారీ

రైతుల నుంచి అధిక కమీషన్ వసూలు చేసిన ఏడుగురు అడ్తిదారులకు నోటీసులు జారీ చేశారు. అంతేకాకుండా ఆ ఏడాదిగా కార్యదర్శిగా పనిచేసిన రాహుల్, గ్రేడ్–2 కార్యదర్శి తోట చందర్, బియ్యాబాని(రిటైర్డ్ గ్రేడ్–2 కార్యదర్శి), అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణ మీనన్, సూపర్ వైజర్ వెంకన్న నాయక్‌కు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చార్జీమెమోలు జారీ చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో పనిచేస్తున్న సూపర్‌వైజర్ దంతాల గంగాధర్, స్వప్నకు ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి గుగులోత్ రెడ్డి చార్జీ మెమోలు జారీ చేశారు. అధిక కమీషన్ల వ్యవహారం మార్కెట్ వర్గాల్లో కలకలం రేపుతోంది. వెలుగుచూసిన ఘటనలు ఒకటి, రెండు కాగా, మార్కెట్ యార్డులో రైతులు పెద్ద ఎత్తున మోసాలకు గురవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని తెలంగాణ రైతు సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు.

గ్రీవెన్స్ తీరు మారాల్సిందే..



హనుమకొండ కలెక్టరేట్‌లో దరఖాస్తులు అందించడానికి బారులుదీరిన ప్రజలు

- రసీదు కోసం గంటల తరబడి వేచి ఉండడమేంటి?
- నేను సంతకం పెట్టాక మీకోసం ఎదురు చూడడం ఎందుకు?
- సాఫ్ట్‌వేర్ మార్చండి.. వచ్చేవారం నుంచి అమలు చేయండి
- హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతీవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ తీరు మారాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం గ్రీవెన్స్ నిర్వహణపై అధికారులతో మాట్లాడి ప్రస్తుతం నిర్వహిస్తున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సమయం వెచ్చించి సమస్యలు విన్నవించేందుకు గ్రీవెన్స్‌సెల్‌కు వస్తారని, గ్రీవెన్స్ దరఖాస్తు రసీదు కోసం గంటల తరబడి వేచి ఉండడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ సంతకం చేసి సంబంధిత అధికారులతో మాట్లాడిన తర్వాత ఆపరేటర్ దగ్గర వెయిటింగ్ ఎందుకని ప్రశ్నించారు. ఇకపై ఈ పద్ధతి మార్చాలని అధికారులను ఆదేశించారు.

ముందే రసీదు ఇవ్వండి

సోమవారం ప్రజావాణికి వచ్చిన దరఖాస్తుదారులకు ఇకపై ముందే రసీదు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణికి వచ్చినవారు నేరుగా రసీదులు ఇచ్చే ప్రదేశంలో సంబంధిత సిబ్బందికి తమ దరఖాస్తు ఇస్తే అది పరిశీలించి ఏ శాఖకు వెళ్లాలో ఆ శాఖ పేరు పైన రాయాలని, మిగతా వివరాలతో రసీదు ఇస్తే రసీదుతో పాటు దరఖాస్తు తీసుకొని వారు తన వద్దకు వస్తారని తెలిపారు. ఒకవేళ సిబ్బందికి సంబంధిత దరఖాస్తు ఏ శాఖకు ఫార్వర్డ్ చేయాలో.. తెలియకపోతే కలెక్టర్ పేరుతో పంపాలని సూచించారు. అప్పుడు ఆ దరఖాస్తుపై కలెక్టరే నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అవసరమైతే దరఖాస్తు తీసుకునే చోట ఒక సీనియర్ అధికారి ఉండి అది ఏ శాఖకు సంబంధించిందో పరిశీలించాలన్నారు. వచ్చే సోమవారం ప్రజావాణి నుంచే ఇది అమలు కావాలని, అలా ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌కు సంబంధించి మార్పులు చేర్పులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

తొలి రోజు నుంచే మార్పునకు శ్రీకారం

కలెక్టర్‌గా విధుల్లో చేరిన నాటి నుంచే స్నేహ శబరీష్ పాలనపై తన మార్క్ చూపిస్తున్నారు. మొదటి రోజు ప్రజావాణి సందర్భంగా ప్రజలు బారులుదీరి నిలబడడం చూసి ఆవేదన చెందారు. వారందరికీ కుర్చీలు వేసి కూర్చోబెట్టాలని ఆదేశించడంతో సిబ్బంది ఆమేరకు చర్యలు తీసుకున్నారు. ఆతర్వాత సంబంధిత మండల అధికారులతో ఫోన్లో మాట్లాడారు. దరఖాస్తు ఫార్వర్డ్ చేయడం మాత్రమే కాకుండా.. నేరుగా తన వద్ద ఉన్న ల్యాప్‌టాప్‌లో మండల స్థాయి ముఖ్య అధికారులను జూమ్‌లో ఉంచి వారితో నేరుగా మాట్లాడుతున్నారు. దీంతో గ్రీవెన్స్ ముగిసే వరకు సంబంధిత అధికారులు మండల స్థాయిలో అందుబాటులో ఉంటూ వారికి సంబంధించిన దరఖాస్తులపై కలెక్టర్‌కు సమాధానం ఇస్తున్నారు. ఇది కొంత వరకు సత్ఫలితాలు ఇస్తుండగా, తాజాగా చేసిన ముందస్తు రసీదుల మార్పు విషయం ఎలాంటి ఫలితాలను ఇస్తుందో వేచి చూడాలి. అయితే ముందుగా రసీదులు ఇస్తే ఎదురయ్యే ఇబ్బందులను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదట అమలు చేద్దామని తర్వాత వచ్చే ఇబ్బందులను సరిచేద్దామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌ఓ వైవీ గణేశ్, పరకాల ఆర్డీఓ డాక్టర్ కె.నారాయణ ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సానుకూలంగా స్పందించండి

ప్రజావాణికి వచ్చే దరఖాస్తుదారులకు సానుకూల వైఖరితో సమాధానం ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రభుత్వ రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాల గురించి దరఖాస్తులు చేసినప్పుడు అర్హత ఉన్నవారు వస్తే ప్రస్తుతం అర్హత ఉన్నప్పటికీ పథకం అమలులో లేదని రాగానే పరిశీలిస్తామని చెప్పాలంటూ సూచించారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలకు అధికారులపై, ప్రభుత్వంపై నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రతీ గ్రీవెన్స్ దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలని దరఖాస్తుదారుడి మొబైల్ నంబరు, దరఖాస్తులోని మొదటి పేజీ స్కాన్ చేసి ఆన్‌లైన్ చేయాలని కలెక్టర్ సూచించారు.

యూరియా కోసం ఆధార్ కార్డుల క్యూ..



యూరియా కోసం పీఏసీఎస్ ఎదుట ఆధార్ కార్డుల లైన్ పెట్టిన రైతులు

కొత్తగూడ: యూరియా కోసం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలోని పీఏసీఎస్ కార్యాలయం ఎదుట రైతులు తమ ఆధార్ కార్డులను లైన్‌లో పెట్టి వేచి ఉన్నారు. యూరియా కొరత ఉన్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో రైతులు ఎగబడుతున్నారు.

దాతలు చేయూతనందించండి..

- చావు బతుకుల మధ్య సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మానస..
- వైద్య ఖర్చులకు సాయం చేయాలని వేడుకుంటున్న కుటుంబీకులు

కన్నీటి గాథ



ఐసీయూలో చికిత్స పొందుతున్న మానస

కాజీపేట: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను విధి వక్రీంచింది. పెళ్లి అయిన మూడు సంవత్సరాలకే మంచనపడేసింది. ఫలితంగా ఆ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో ఒక్కసారిగా జీవచ్ఛవంలా మారడంతో కుటుంబ సభ్యులతోపాటు బంధుమిత్రులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట పట్టణం సోమిడికి చెందిన నాయుడు మానస గౌడ్‌కు మూడు సంవత్సరాల క్రితం ఇదే గ్రామానికి చెందిన బత్తిని వంశీకృష్ణతో వివాహం జరిగింది. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవల స్వల్ప అస్వస్థతగా ఉందని మానస చెప్పగా కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షలు నిర్వహించారు. మూత్ర పిండాలు, శ్వాసకోశతో పాటు అవయవాలు దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యాధుల చికిత్సకు దాదాపు రూ.16 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు స్పష్టం చేశారు. దీంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. మిగతా డబ్బులు ఎంతకూ సమకూరడం లేదు. దీంతో చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే మార్గం లేక మానస గౌడ్ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. దీనిపై మనసున్న మహారాజులు స్పందించి ముందుకొచ్చి మానస వైద్యానికయ్యే ఖర్చు అందించాలని కుటుంబ సభ్యులు చేతులెత్తి వేడుకుంటున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు స్పందించి ఉచితంగా వైద్య చికిత్స లభించేలా చూడాలని వేడుకుంటున్నారు.

దాతలు 99666 68666 నంబర్‌కు ఫోన్ పే (నాయుడు మనోజ్‌కుమార్) ద్వారా ఆర్థిక సాయం చేసి మానసను బతికించాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో నాలుగు కాలేజీలకు..

విద్యారణ్యపురి : తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని లెక్చరర్లకు సోమవారం ప్రిన్సిపాళ్లుగా పదోన్నతులు కల్పించారు.ఈమేరకు హైదరాబాద్‌లో ఇంటర్ విద్యా కమిషనర్ కృష్ణ ఆదిత్య, సంబంధిత ఉన్నతాధికారులు ఆయా అధ్యాపకులకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి పదోన్నతులు కల్పించారని సమాచారం. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ కవిత ఆత్మకూరు ప్రభుత్వజూనియర్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. పరకాల ప్రభుత్వ జూనియర్ కాలేజీ జూవాలజీ లెక్చరర్ ఆర్. మాధవి కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మల రామారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ లెక్చరర్ సుజాత వరంగల్ జిల్లా వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, హయత్‌నగర్‌నుంచి మహబూబాబాద్ జిల్లా బయ్యారం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా రాజమణి పదోన్నతి పొందారు. వీరు ఆయా కాలేజీల్లో సోమవారం సాయంత్రం ప్రిన్సిపాళ్లుగా జాయిన్ అయ్యారు. సంబంధిత జిల్లాల డీఐఈఓకు రిపోర్టు చేశారు. రాష్ట్రంలో 81 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రిన్సిపాల్ పోస్టులకు పదోన్నతులు కల్పిస్తే 26 మంది లెక్చరర్లు నాట్‌విల్లింగ్ ఇచ్చారని సమాచారం.

నిట్ వరంగల్‌లో బాంబు కలకలం



కాజీపేట అర్బన్ : నిట్ వరంగల్‌లో బాంబు కలకలం సృష్టించింది. నిట్‌ను మానవ బాంబునై పేలుస్తానంటూ ఓ గుర్తుతెలియని వ్యక్తి నిట్ వరంగల్‌కు చెందిన గ్రూప్‌లో మూడు రోజుల క్రితం ఈమెయిల్ చేసినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై యాజమాన్యం అప్రమత్తమైంది. శని, ఆదివారాలు సెలవు దినాలుకావడంతో సోమవారం తెరుకుంది. మెయిల్‌ను గమనించి పోలీసులకు సమాచారమిచ్చింది. దీంతో కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి.. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీతో మాట్లాడి క్యాంపస్‌లోని మెయిన్ బిల్డింగ్‌తో పాటు వివిధ ప్రాంతాలను బాంబు స్క్వాడ్‌తో తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బాంబు లభించకపోవడంతో యాజమాన్యం, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ఈ ఫేక్ ఈమెయిల్‌పై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

కూరగాయల సాగుకు ప్రోత్సాహం



పందిరి విధానంలో సాగు చేస్తున్న కూరగాయలు



క్యాబేజీ తోట

- వందశాతం రాయితీపై నారు
- ఒక రైతుకు 5 ఎకరాలు పరిమితి

హన్మకొండ: రాయితీపై నారు అందిస్తూ ప్రభుత్వం కూరగాయల సాగును ప్రోత్సహిస్తోంది. ఒక్కో రైతుకు ఐదెకరాల వరకు.. వందశాతం రాయితీపై నారును సరఫరా చేస్తోంది. ఉద్యాన శాఖ ద్వారా కూరగాయల సాగు విస్తీర్ణం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రాయితీ సదుపాయం కల్పించింది. వందశాతం రాయితీపై టమాట, వంగ, పచ్చి మిర్చి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ నారును సరఫరా చేస్తోంది. సిద్దిపేట జిల్లా ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో రైతులు సూచించిన రకం అందించేందుకు సిద్ధంగా ఉన్నారు. దీనికిగాను రైతులు 30 రోజుల ముందుగా విత్తన రకం, పట్టాదారు పాస్ బుక్, ఆధార్, బ్యాంకు ఖాతా పాస్ బుక్ జిరాక్స్ ప్రతులను జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ కార్యాలయంలో అందించాలి.

శాశ్వత పందిర్ల నిర్మాణానికి..

శాశ్వత పందిర్ల నిర్మాణం, కూరగాయల సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోంది. అర ఎకరానికి రూ.50 వేల చొప్పున రెండున్నర ఎకరాలకు వరకు రాయితీ అందిస్తోంది. మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు రాయితీ అందిస్తోంది. కలుపు సమస్యను అధిగమించడానికి, ఎరువుల యాజమాన్యం, తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి సాధించడానికి మల్చింగ్ పద్ధతి ఉపయోగపడుతుంది. ఈపద్ధతిలో సాగు ఎకరాకు రూ.8 వేల చొప్పున 5 ఎకరాల వరకు రాయితీ అందిస్తోంది.

అధిక దిగుబడి ఇచ్చేలా..

ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రం ద్వారా కూరగాయల (వంగ) సాగు వైపు రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. భూమి నుంచి సంక్రమించే వివిధ రకాల తెగుళ్లను, చౌడు నేలలను తట్టుకునేలా, అధిక దిగుబడి, ఎక్కువ కాలం దిగుబడి ఇచ్చేలా వంగలో అంటు మొక్కలను ప్రభుత్వం రాయితీపై సరఫరా చేస్తోంది. దీనికి ప్రభుత్వం ఎకరానికి రూ.30 వేల వరకు రాయితీ ఇస్తోంది. ట్రెల్లిసింగ్ విధానంలో టమాట, ఇతర కూరగాయల పంటలను సాగు చేసేందుకు ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు రాయితీ అందిస్తోంది. అంతేకాకుండా సూక్ష్మ సేద్యానికి రాయితీని సమకూరుస్తోంది. బిందు సేద్యానికి బీసీ, సన్నకారు, చిన్నకారు రైతులకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీ రైతులకు వందశాతం, ఇతరులకు 80 శాతం రాయితీని, తుంపర్ల సేద్యానికి అన్ని కేటగిరీల రైతులకు 75 శాతం రాయితీపై పరికారులు అందిస్తున్నారు.

అధికారులను సంప్రదించాలి..



రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల సాగుకు అందిస్తున్న రాయితీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెంచాలి. కూరగాయలకు భారీ డిమాండ్ ఉంది. కూరగాయల సాగు లాభదాయకం. రైతులు కూరగాయల నారు, ఇతర పద్ధతిలో సాగు కోసం రాయితీ పొందేందుకు అందుబాటులో ఉన్న ఉద్యాన అధికారులను సంప్రదించాలి.

–శ్రీనివాస్‌రావు, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి, వరంగల్

స్విమ్మింగ్‌పూల్‌కు సెలవు


- రూ.40 లక్షలతో మరమ్మతులు
- నెల రోజులు నోఎంట్రీ



స్విమ్మింగ్‌పూల్‌లోని నీటిని తోడుతున్న మోటార్లు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ బాలసముద్రంలో కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్‌కు నెలరోజులు సెలవులొచ్చాయి. రెండు నెలల క్రితం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే వేసవిలో స్విమ్మింగ్‌పూల్‌కు రద్దీ ఉన్న నేపథ్యంలో పనులు చేపట్టకుండా నిలిపివేశారు. ఈ క్రమంలో వర్షాకాలం ప్రారంభం, విద్యా సంస్థలు తెరుచుకోవడంతో స్విమ్మింగ్ పూల్‌కు వచ్చే వారి సంఖ్య తగ్గింది. దీంతో వారం క్రితం స్విమ్మింగ్ పూల్ అభివృద్ధి పనులు ప్రారంభించారు. రోజుకు ఆరు గంటలకు పైగా స్విమ్మింగ్ పూల్‌లోని నీరు తోడుతున్నారు. సుమారు రూ.30 లక్షలతో పనులు చేపట్టారు. పూల్ లోపల టైల్స్, వాష్‌రూమ్స్, పూల్‌కు సరిపడా విద్యుత్ ఉత్పత్తి కోసం 10కిలో వాట్స్ సోలార్ ప్లాంట్, పోటీలు జరిగినప్పుడు వీక్షించేందుకు షెడ్డు నిర్మాణం తదితర పనులు చేస్తున్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు



క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి చొరవతో స్విమ్మింగ్ పూల్ అభివృద్ధి పనులు చేపట్టాం. నెల రోజుల్లో పూర్తి చేసి స్విమ్మర్లకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పనులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నాం.

– గుగులోత్ అశోక్‌కుమార్, డీవైఎస్‌ఓ, హనుమకొండ

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



సంతోశ్‌యాదవ్ (ఫైల్)

ఖిలా వరంగల్: అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం .. ఖిలా వరంగల్ మధ్య కోట యాదవవాడకు చెందిన వేల్పుల సంతోశ్ యాదవ్(56) వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇటీవల యూరిక్ యాసిడ్ లెవల్ పెరగడంతో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఈ సమస్య ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం తెల్లవారుజామున ఇంటి ప్రాంగణంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం కుటుంబీకులు గమనించి మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం అందజేయగా వారు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రశ్నించినందుకే మావోయిస్టులను చంపుతారా?



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

- పోరాటాలతోనే సమస్యల పరిష్కారం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

భూపాలపల్లి అర్బన్: మానవ సమాజం ఉన్నంత వరకూ కమ్యూనిజం ఉంటుందని, కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నించినందుకే మావోయిస్టులను చంపుతారా అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో పార్టీ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన భారీ బహిరంగ సభకు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో కలిసి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని కేటీకే 5వ గని మలుపు నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీ ప్రపంచంలో అతిపెద్దన్నారు. ఏ దేశంలోనైనా కమ్యూనిస్టులు ఉంటారని, ఇతర బూర్జువా పార్టీలు వారి ప్రాంతాలకు పరిమితమవుతారన్నారు. ఎప్పటికీ పేదల పక్షాన నిలబడేది ఎర్రజెండా పార్టీ అన్నారు. 2026 మార్చి వరకు మావోయిస్టులను అంతం చేస్తామని అమిత్ షా చెప్పడం దుర్మార్గమన్నారు. ఒక కమ్యూనిస్టు చనిపోతే 100 మంది జన్మిస్తారని, కమ్యూనిస్టులకు మరణం లేదన్నారు. దోపిడీ ఉన్నంత వరకూ కమ్యూనిజం ఉంటుందన్నారు. పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. జిల్లాలో అనేక సింగరేణి కార్మికుల సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామన్నారు. పట్టణంలోని గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సభలో నాయకులు సుధాకర్‌రెడ్డి, శాంతికుమార్, సతీశ్, సుగుణ, రామ్‌చందర్, శ్రీనివాస్, ఆసిఫ్ పాషా, సమ్మిరెడ్డి, సోతుకు ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.